మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
బుధవారం 27 మే 2026 పేజీలు : 4



# రైతుకు ఎరువుల కార్డు

## ఎల్‌నినో ఎఫెక్ట్‌పై జిల్లా యంత్రాంగం ఫోకస్

ఖరీఫ్ సీజన్‌కు ముందే రైతులను శాస్త్రీయ సాగు వైపు మళ్లించేందుకు గుంటూరు జిల్లా యంత్రాంగం కీలక చర్యలు చేపట్టింది. రైతులకు ప్రత్యేక “ఎరువుల కార్డులు” జారీ చేస్తూ, అవసరానికి మించి ఎరువుల వినియోగాన్ని తగ్గించడంపై దృష్టి సారించింది. మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు తలెత్తే అవకాశాల నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది.

గుంటూరు, మే 25 (రక్షణ న్యూస్)

2లో.

# సూర్యలంకకు కొత్త హంగులు



వివరాలు 2లో..

## టూరిజం ఆఫీస్, మెడికల్ ఎమర్జెన్సీ సెంటర్లు త్వరలో ప్రారంభం

సూర్యలంక బీచ్‌ను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయడంతో పాటు వృద్ధులు, పర్యాటకులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. టూరిజం ఆఫీస్, మెడికల్ ఎమర్జెన్సీ సెంటర్లను ఈ నెల 30న ప్రారంభించేలా పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. వృద్ధుల కోసం ప్రత్యేక సీటింగ్, సీఆర్‌జెడ్ నిబంధనల మేర తీరప్రాంత అభివృద్ధిపై కూడా అధికారులకు కీలక సూచనలు చేశారు.

బాపట్ల, రక్షణ న్యూస్

# బాపట్ల టిడిపి పట్టణ అధ్యక్షుడిగా ఆంద్రేయ

## నిబద్ధతతో పనిచేసిన కార్యకర్తకు పార్టీ గుర్తింపు



బాపట్ల రక్షణ న్యూస్

2లో.

తెలుగుదేశం పార్టీకి దీర్ఘకాలంగా సేవలందిస్తున్న సీనియర్ నాయకుడు మందపాటి అందరియా ను బాపట్ల పట్టణ టిడిపి అధ్యక్షుడిగా నియమించారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన కార్యకర్తకు గుర్తింపుగా ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. బాపట్లలో పార్టీ బలోపేతానికి ఆయన కృషి కొనసాగుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# డిజిటల్ వేదికగా మహానాడు

- 10 క్లస్టర్లలో భారీ స్క్రీన్లు
- పొదుపు వారోత్సవాల నేపథ్యం
- టీడీపీ నూతన కమిటీల ఏర్పాటు

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 27, 28 తేదీల్లో తెలుగుదేశం పార్టీ డిజిటల్ మహానాడు నిర్వహించనున్నట్లు బాపట్ల ఎమ్మెల్యే వేగేశ న నరేంద్ర వర్మ రాజు తెలిపారు. బాపట్ల నియోజకవర్గంలోని 10 క్లస్టర్లలో భారీ స్క్రీన్ల ద్వారా కార్యక్రమాలు నిర్వహిం చి పార్టీ శ్రేణులను భాగస్వామ్యం చేయను న్నట్లు వెల్లడించారు.

బాపట్ల రక్షణ న్యూస్



వివరాలు 2లో..

# జిల్లాలో డ్రగ్స్ కలకలం



వివరాలు 2లో..

గుంటూరు రక్షణ న్యూస్

- దుగ్గిరాలలో మెరుపు దాడులు
- 12 మంది అదుపులోకి
- పీడీ యాక్ట్ హెచ్చరిక

గుంటూరు జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై పోలీసులు ఉక్కుపాదం మోపు తున్నారు. దుగ్గిరాల పోలీసుల మెరుపు దాడుల్లో 2.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకోగా, ఐదుగురు విక్రేతలు, ఏడుగురు వినియోగదారులను అదుపులోకి తీసుకున్నారు. పునరావృత నేరస్తులపై పీడీ యాక్ట్ అమలు చేస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 5/27/2026 4:33 AM Page 2



# డిజిటల్ వేదికగా మహానాడు

మొదటి పేజీ తరువాయి

బాపట్ల రక్షణ న్యూస్

బాపట్ల జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న పొదుపు వారోత్సవాల నేపథ్యంలో నెల్లూరులో జరగాల్సిన మహానాడును రద్దు చేసి, రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్లలో డిజిటల్ మహానాడు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాపట్ల నియోజకవర్గంలో 10 క్లస్టర్లలో భారీ ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అలాగే బాపట్ల నియోజకవర్గ టీడీపీ పరిశీలకులుగా గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమాలు కొనసాగనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని మూడు మండలాలు, బాపట్ల పట్టణానికి నూతన టీడీపీ కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

# జిల్లాలో డ్రగ్స్ కలకలం

మొదటి పేజీ తరువాయి

గుంటూరు రక్షణ న్యూస్

గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దుగ్గిరాల పోలీసులు నిర్వహించిన మెరుపు దాడుల్లో 2.5 కేజీల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్, రూ.2 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ కేసులో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని, సేవిస్తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితులు ఒడిశా రాష్ట్రంలోని గోరక్‌పూర్ ప్రాంతం నుంచి గంజాయిని తీసుకువచ్చి జిల్లాలో విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 300 మందికి పైగా పాత నేరస్తులకు గంజాయి యూరిన్ పరీక్షలు నిర్వహించగా, వారిలో 30 మంది గంజాయి సేవిస్తున్నట్లు నిర్ధారణ అయిందన్నారు. దుగ్గిరాల, మంగళగిరి, తెనాలి, పెదకాకాని ప్రాంతాల్లో గంజాయి వినియోగం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. గంజాయి విక్రయాల్లో మళ్లీ మళ్లీ పట్టుబడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ పీడీ యాక్ట్ నమోదు చేస్తున్నామని, ఇప్పటికే పలువురిని జైలుకు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు. గంజాయి విషయంలో ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు.

# బాపట్ల టిడిపి పట్టణ అధ్యక్షుడిగా ఆంద్రేయ

మొదటి పేజీ తరువాయి

బాపట్ల,రక్షణ న్యూస్

తెలుగుదేశం పార్టీకి దీర్ఘకాలంగా సేవలందిస్తున్న సీనియర్ నాయకుడు, ఆంధ్రప్రదేశ్ నాటక పరిషత్ డైరెక్టర్ మందపాటి అందరియా ను బాపట్ల పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా నియమించారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఒకే జెండాతో పనిచేస్తూ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న నాయకుడికి ఈ బాధ్యతలు దక్కడం పార్టీ శ్రేణుల్లో ఆనందాన్ని నింపింది. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తూ సమర్థ నాయకత్వాన్ని ముందుకు తీసుకువస్తున్న బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ నిర్ణయం అభినందనీయమని పార్టీ నాయకులు పేర్కొన్నారు. బాపట్ల పట్టణంలో రెండు దశాబ్దాల తర్వాత తెలుగుదేశం పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధించడంలో మందపాటి అందరియా కీలక పాత్ర పోషించినట్లు నాయకులు గుర్తుచేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం, పార్టీ కార్యక్రమాల నిర్వహణలో ఆయన చూపిన చొరవ ప్రత్యేకంగా నిలిచిందని అభిప్రాయపడుతున్నారు. నిబద్ధత కలిగిన నాయకులకు బాధ్యతలు అప్పగించడం ద్వారా పార్టీ మరింత బలోపేతం అవుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మందపాటి ఆంద్రేయకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో బాపట్ల పట్టణంలో పార్టీ మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

# రైతుకు ఎరువుల కార్డు

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు, మే 25 (రక్షణ న్యూస్):**

జిల్లాలో రైతులకు ప్రత్యేకంగా "ఎరువుల కార్డులు" జారీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ తెలిపారు. జూన్ మొదటి వారంలోనే రైతులకు కార్డులు పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖల పనితీరును సమీక్షించిన కలెక్టర్, రైతు సాగు చేసే పంటకు ఎంత మేర ఎరువులు అవసరమో కార్డులో స్పష్టంగా సూచనలు ఉంటాయని వెల్లడించారు. అధిక పరిమితిలో యూరియా, ఇతర ఎరువులు వినియోగించడం వల్ల రైతుకు అదనపు ఖర్చు పెరగడమే కాకుండా భూసారం, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం ఉంటుందని హెచ్చరించారు. పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని వేగవంతం చేయాలని, ముఖ్యంగా పొన్నూరు, ఫిరంగిపురం, తెనాలి, మేడికొండూరు, కాకుమాను మండలాల్లో పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ యాప్‌లో రైతుల వివరాల నమోదు కేవలం 30 శాతం మాత్రమే పూర్తయిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. తెనాలి, మంగళగిరి, తాడికొండ, కొల్లిపర మండలాల్లో నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కౌలు రైతులకు సి.సి.ఆర్.సి కార్డుల జారీ కోసం అర్హులైన రైతులను గుర్తించి జాబితాలను అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఉద్యానవన పథకాలు, ఏపీఎంఐపీ సూక్ష్మ నీటి పథకం లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**ఎల్‌నినోపై అప్రమత్తం...** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉందని, రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రకృతి వ్యవసాయం వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యాన్ని పెంచుతుందని నిపుణులు సూచిస్తున్నారని తెలిపారు. జిల్లాలో 46,594 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని ఆదేశించారు. అవసరమైన కిట్ల పంపిణీ వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. పద్మావతి మాట్లాడుతూ ఖరీఫ్‌కు జిల్లాకు 18,600 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమని, వాటిని ఏపీసీడ్స్, ప్రైవేట్ సంస్థల ద్వారా జూన్ తొలి వారంలో రైతులకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ 2026కు 57 వేల టన్నుల ఎరువులు అవసరమవుతాయని అంచనా వేయగా, ఇప్పటికే 36,371 టన్నుల ఎరువులు నిల్వ చేశామని వెల్లడించారు. ఇందులో 12,588 టన్నుల యూరియా, 4,931 టన్నుల డీఏపీ, 16,207 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు ఉన్నాయని వివరించారు. రైతులకు అవసరమైన వ్యవసాయ యంత్ర పరికరాల కోసం రూ.3.04 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఖరీఫ్ ప్రారంభానికి ముందే పంపిణీ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతుల అవగాహన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు.

# సూర్యలంకకు కొత్త హంగులు

మొదటి పేజీ తరువాయి

బాపట్ల, రక్షణ న్యూస్

సూర్యలంక బీచ్‌ను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయడంతో పాటు వృద్ధులు, పర్యాటకులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఎ తెలిపారు. సూర్యలంకలో టూరిజం ఆఫీస్, మెడికల్ ఎమర్జెన్సీ సెంటర్లను ఈ నెల 30న ప్రారంభించేలా పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సూర్యలంక తుఫాన్ సెంటర్‌లో ఏర్పాటు అవుతున్న టూరిజం ఆఫీస్, మెడికల్ ఎమర్జెన్సీ సెంటర్‌తో పాటు స్వదేశీ దర్శన్ 2.0 పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు.

పర్యాటకులకు మెరుగైన సేవలు అందించేందుకు టూరిజం ఆఫీస్‌ను ఏర్పాటు చేస్తున్నామని, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా మెడికల్ ఎమర్జెన్సీ సెంటర్‌ను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కేంద్రాలకు అవసరమైన ఫర్నిచర్, కంప్యూటర్లు, మెడికల్ పరికరాలు, ఇతర మౌలిక వసతులను వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. స్వదేశీ దర్శన్ 2.0 కింద జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తికావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల్లో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరిస్తూ, పర్యాటకులను ఆకర్షించేలా సూర్యలంక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. అనంతరం డ్వాక్రా మహిళలు తయారు చేసిన 'బే ఆఫ్ బాపట్ల' క్యాప్‌ను కలెక్టర్ ఫోన్‌పే ద్వారా కొనుగోలు చేసి మహిళా సంఘాల ఉత్పత్తులకు ప్రోత్సాహం అందించారు. స్థానిక మహిళల ఉత్పత్తులను మరింత మార్కెట్‌కు తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇదిలా ఉండగా, వృద్ధుల సంక్షేమ చట్టంపై నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ వినోద్ కుమార్ ఎ వృద్ధులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. సూర్యలంక బీచ్‌కు వచ్చే వృద్ధుల కోసం ప్రత్యేకంగా 20 మీటర్ల మేర సీటింగ్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. పత్రికలు అందుబాటులో ఉంచడంతో పాటు విశ్రాంతి తీసుకునే వసతులు కల్పిస్తామని చెప్పారు. వృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వృద్ధులకు ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే సమాచారం పంపితే అధికారులు స్పందించి సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వృద్ధులైన తల్లిదండ్రుల పట్ల కుమారులు, కుమార్తెలు సమాన బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. అదేవిధంగా సీఆర్‌జెడ్ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ తీరప్రాంత అభివృద్ధి సీఆర్‌జెడ్ నిబంధనల ప్రకారమే చేపడుతున్నామని స్పష్టం చేశారు. బాపట్ల జిల్లాలో 73 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందని, చెన్నై అన్నా యూనివర్సిటీ ద్వారా సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చీరాల, వేటపాలెం, చిన్నగంజాం మండలాలను బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి చేర్చే అంశాన్ని ప్రభుత్వానికి నివేదిస్తున్నట్లు వెల్లడించారు. మడ అడవుల నరికివేత, తొలగింపు వంటి చర్యలను సహించబోమని హెచ్చరించారు. సీఆర్‌జెడ్, కాలుష్య నియంత్రణ మండలి పరిధిలో ఉన్న 32 అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమాల్లో జిల్లా టూరిజం అధికారి ఆనంద్ పాల్, విద్యుత్ శాఖ ఎస్ఈ ఆంజనేయులు, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజన్ బాబు, డిసిహెచ్ కోఆర్డినేటర్ డాక్టర్ పద్మావతి, వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు సువార్త, డీఎస్పీ జగదీష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్‌కు కట్టుదిట్టమైన నిబంధనలు

### అనుమతించిన జంతువులకే వధశాలల్లో ప్రవేశం

**గుంటూరు, రక్షణ న్యూస్..**

బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతలు, ప్రజారోగ్యం, సామాజిక సామరస్య పరిరక్షణకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. పశుసంవర్ధక శాఖ ధృవీకరించి అనుమతించిన జంతువులను మాత్రమే వధశాలలకు తరలించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ స్పష్టం చేశారు.అనుమతి పొందిన వధశాలలు, వధ కేంద్రాల్లోనే జంతువుల వధ నిర్వహించాలని పేర్కొన్నారు. తాత్కాలిక వధశాలల ఏర్పాటుకు మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులను సంప్రదించాలని సూచించారు. అక్రమ రవాణా, అనధికార వధశాలలు, నిషేధిత జంతువుల వధను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.వధ కేంద్రాల వద్ద పశుసంవర్ధక, రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్త తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్రమ రవాణా, అనధికార వధలను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు, మల్టీ డిసిప్లినరీ కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.పండుగ సందర్భంగా పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రత చర్యలను



కట్టుదిట్టంగా అమలు చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మసదులు, అనుమతి ంచిన వధ కేంద్రాల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య ఏర్పాట్లు చేపడుతున్న ట్లు చెప్పారు.

**సోషల్ మీడియాలో వదంతులపై నిఘా...**సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు, వదంతులు, అభ్యంతరకర పోస్టులు వ్యాప్తి చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల ఫిర్యాదుల స్వీకరణ కోసం మున్సిపల్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ప్రజలు శాంతియుత వాతావరణంలో బక్రీద్ పండుగను నిర్వహించుకోవాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

# మహానాడుకు పర్చూరులో పండుగ వాతావరణం

### క్లస్టర్ల వారీగా భారీ ఏర్పాట్లు.. ఎమ్మెల్యే ఏలూరి సారథ్యంలో సందడి

**పర్చూరు, రక్షణ న్యూస్:**

తెలుగుదేశం పార్టీ మహానాడు వేడుకలను పురస్కరించుకుని పర్చూరు నియోజకవర్గం వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో ఆరు మండలాల పరిధిలోని 12 క్లస్టర్లలో మహానాడు వేడుకలకు భారీ ఏర్పాట్లు చేపట్టారు. మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జులు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేస్తుండగా తెలుగు తమ్ముళ్ల రాకతో వేడుక ప్రాంగణాలు కళకళలాడుతున్నాయి.మహానాడు కార్యక్రమాలకు కేఎస్ఎస్ సభ్యులు, బూత్ కమిటీలు, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు. కార్యక్రమాలను వర్చువల్‌గా వీక్షించేందుకు ఆయా కేంద్రాల్లో ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. కార్యకర్తలకు భోజన సదుపాయాలు కూడా కల్పిస్తున్నారు. పసుపు జెండాలు, తోరణాలతో వేడుక ప్రాంతాలు ప్రత్యేక ఆకర్షణగా మారుతున్నాయి.మార్టూరు మండలంలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ప్రధాన కార్యక్రమం నిర్వహించనుండగా, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొననున్నారు. మహానాడు వేడుకలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేయడంతో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.



**మండలాల వారీగా ఏర్పాట్లు**

**మార్టూరు మండలం:**
క్లస్టర్-1, 2, 3 పరిధిలోని గ్రామాలకు సంబంధించిన కార్యక్రమాలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించనున్నారు.

**యద్దనపూడి మండలం:**
క్లస్టర్-4 కార్యక్రమం యద్దనపూడి టీడీపీ కార్యాలయంలో జరగనుంది.

**పర్చూరు మండలం:**
క్లస్టర్-5 కార్యక్రమం నూతలపాడులో, క్లస్టర్-6 కార్యక్రమం కొల్లావారి కళ్యాణ మండపంలో నిర్వహించనున్నారు.

**కారంచేడు మండలం:**
క్లస్టర్-7 కార్యక్రమం యార్లగడ్డ కళ్యాణ మండపంలో, క్లస్టర్-8 కార్యక్రమం స్వర్ణ గ్రామ ఆడిటోరియంలో జరగనుంది.

**ఇంకొల్లు మండలం:**
క్లస్టర్-9 కార్యక్రమం లక్ష్మీ ప్రియాంక కళ్యాణ మండపంలో, క్లస్టర్-10 కార్యక్రమం ఇడుపులపాడులో నిర్వహించనున్నారు.

**చిన్నగంజాం మండలం:**
క్లస్టర్-11 కార్యక్రమం వాసవి టెంపుల్ కళ్యాణ మండపంలో, క్లస్టర్-12 కార్యక్రమం పెద్దగంజాంలో జరగనుంది.

# మారెళ్లలో గృహ గణన పరిశీలన

### వివరాల నమోదు ఖచ్చితంగా చేపట్టాలి...

**ముండ్లమూరు, రక్షణ న్యూస్:**

మండలంలోని మారెళ్ల గ్రామంలో జరుగుతున్న గృహ గణన (సెన్సస్) కార్యక్రమాన్ని సూపర్వైజర్ తిరుమలరావు పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి గణన ప్రక్రియను తనిఖీ చేస్తూ సిబ్బంది పనితీరును పరిశీలించారు.ఈ సందర్భంగా గృహాల వివరాలు, కుటుంబ సభ్యుల సమాచారం ఖచ్చితంగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. గణనలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ



పథకాల అమలులో గృహ గణన కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.ప్రతి ఇంటి వివరాలను సమగ్రంగా నమోదు చేసి ప్రభుత్వానికి సరైన సమాచారం అందించేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన సూచించారు.

# అన్న క్యాంటీన్లలో వేసవి సౌకర్యాల పెంపు

### కూల్‌రూఫ్ పెయింటింగ్, ప్రత్యేక షెడ్ల ఏర్పాటు

### భోజన నాణ్యత పర్యవేక్షణకు నోడల్ అధికారి




**గుంటూరు, రక్షణ న్యూస్**

వేసవి తీవ్రత నేపథ్యంలో అన్న క్యాంటీన్లకు వచ్చే సామాన్య ప్రజలు, కార్మికులు ఇబ్బందులు పడకుండా గుంటూరు నగర పాలక సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టింది. నగరంలోని అన్ని అన్న క్యాంటీన్లలో మెరుగైన వసతులు కల్పించాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశాలు జారీ చేశారు.ఎండ వేడి ప్రభావాన్ని తగ్గించేందుకు నగరంలోని ఏడు అన్న క్యాంటీన్ల భవనాలపై యుద్ధప్రాతిపదికన కూల్‌రూఫ్ పెయింటింగ్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. క్యాంటీన్లకు వచ్చే ప్రజలు కూర్చోవడానికి, భోజనం కోసం వేచి ఉండేందుకు వీలుగా ప్రత్యేక షెడ్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు.భోజన నాణ్యత, పరిశుభ్రత, రోజువారీ నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రత్యేక నోడల్ అధికారిని నియమించినట్లు వెల్లడించారు. సామాన్యుడి ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లలో వసతుల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని జీఎంసీ ఎంఎల్ఓ మహేష్ పేర్కొన్నారు.

# బక్రీద్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

### అక్రమ గోవధ, రవాణాపై కఠిన చర్యలు: కమిషనర్ మయూర్ అశోక్




**గుంటూరు, రక్షణ న్యూస్:**

గుంటూరు నగరంలో బక్రీద్ పండుగను సుహృద్భావ వాతావ రణంలో జరుపుకోవాలని నగర కమిషనర్ మయూర్ అశోక్ ప్రజ లను కోరారు. ఈ నెల 28న జరగనున్న బక్రీద్ సందర్భంగా ప్రజ లు పాటించాల్సిన నిబంధనలను మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వివరించారు.గోవధ, గోవులు మరియు దూడల అక్ర మ రవాణా పూర్తిగా నిషేధించామని కమిషనర్ స్పష్టం చేశారు. జంతు సంక్షేమ చట్టాలను ఉల్లంఘిస్తూ గోవధ లేదా అక్రమ రవాణాకు పాల్పడితే జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్రజలు మత సామరస్యాన్ని కాపాడుతూ, జంతు సంక్షేమ చట్టాలను గౌరవిస్తూ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు.పండుగ నేపథ్యంలో పోలీస్, రెవెన్యూ, పశుసంవర్ధక, రవాణా, కాలుష్య నియంత్రణ మండలి, నగర పాలక సంస్థలతో ప్రత్యేక నిఘా కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐదు ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు నగరంలో తనిఖీలు నిర్వహించి, అక్రమంగా తరలిస్తున్న పశువులను స్వాధీనం చేసుకుని గోసంరక్షణశాలకు తరలిస్తాయని వెల్లడించారు.అలాగే ప్రజలకు అవగాహన కల్పించేందుకు పాంప్లెట్లు, బ్యానర్లు, మైకుల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నగర పాలక సంస్థ అనుమతించిన ఆంధ్ర ముస్లిం కాలేజ్ సమీపంలోని రావుఫ్‌నగర్ ప్రాంతం, బి కన్వెన్షన్ సెంటర్ ఎదుట తాత్కాలిక వధశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ కేంద్రాలనే వినియోగించాలని, ఇతర ప్రాంతాల్లో వధ నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.వధశాలల వద్ద పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, జంతు వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతుల్లో తొలగిస్తామని కమిషనర్ తెలిపారు. నగర పాలక సంస్థకు ప్రజలు సహకరించాలని కోరారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 5/27/2026 4:33 AM Page 4



# బీజేపీకి కొత్త అధ్యక్షుడు



**రాజుపాలెం రక్షణ న్యూస్**

రాజుపాలెం మండల బీజేపీ నూతన అధ్యక్షుడిగా డబ్బురి సంజీవరావు నియమితులయ్యారు. భారతీయ జనతా పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు ఏలూరి శశికుమార్ ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది. జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఏలూరి శశికుమార్ చేతుల మీదుగా సంజీవరావు నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శశికుమార్ మాట్లాడుతూ, నూతన అధ్యక్షుడి నాయకత్వంలో రాజుపాలెం మండలంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానం, జిల్లా నాయకత్వానికి డబ్బురి సంజీవరావు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# డ్రగ్స్ స్మగ్లర్ అరెస్ట్



**చిలకలూరిపేట రక్షణ న్యూస్**

పల్నాడు జిల్లా చిలకలూరిపేట సర్కిల్ పరిధిలో గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాకు పాల్పడుతున్న నిందితుడిని చిలకలూరిపేట రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. గత ఏడాది నుంచి గంజాయి, డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 24 గ్రాముల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిందితుడిని నేరుగా రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని, యువతను డ్రగ్స్ బారిన పడకుండా ప్రత్యేక నిఘా ఉంచినట్లు పోలీసులు పేర్కొన్నారు.

# రీ సర్వేలో పారదర్శకతకు ప్రాధాన్యం

## పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి : ఇంచార్జి కలెక్టర్ సంజన సింహ

**నరసరావుపేట రక్షణ న్యూస్**



జిల్లాలో జరుగుతున్న రీ సర్వే పనులను పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ సంజన సింహ అధికారులను ఆదేశించారు. భూ రికార్డుల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. రీ సర్వే, పట్టాదారు పాస్‌బుక్‌ల పంపిణీ, భూ రికార్డుల నవీకరణ తదితర అంశాలపై జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి, ఆర్డీవోలు, తహసీల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామస్థాయిలో గ్రౌండ్ ట్రూతింగ్ నోటీసులు, ఫీల్డ్ హాజరు, 9(2) నోటీసుల ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియలో భాగంగా ఈ-కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. డ్రాఫ్ట్ పట్టాదారు పాస్‌బుక్‌లు అందించే సమయంలో కూడా ఈ-కేవైసీ పూర్తి చేసి రికార్డులను సక్రమంగా నవీకరించాలని సూచించారు. భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, ప్రజల విశ్వాసం అత్యంత ముఖ్యమని పేర్కొన్న ఇంచార్జి కలెక్టర్ సంజన సింహ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

# రైతు సంఘం డిమాండ్

**ముండ్లమూరు రక్షణ న్యూస్**




ముండ్లమూరు మండలంలోని పోలవరం గ్రామంలో పంట వ్యర్థాలను తగలబెడుతున్న సమయంలో అగ్నిప్రమాదానికి గురై మరణించిన రైతు వల్లెపు వెంకటేశ్వర్లు కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల ఆర్థిక సహాయం అందించాలని రైతు సంఘం మండల కమిటీ డిమాండ్ చేసింది. అదే ప్రమాదంలో మూడు ఎకరాల మిర్చి పంట పూర్తిగా దగ్ధమై నష్టపోయిన నాగేశ్వరావు కుటుంబాన్ని కూడా ఆదుకోవాలని కోరింది. వేంపాడులో జరిగిన రైతు సంఘం మండల కమిటీ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పంట ఏడుకొండలు మాట్లాడుతూ, ప్రతి ఏడాది పంట వ్యర్థాలను తగలబెట్టే సమయంలో అగ్నిప్రమాదాలు జరిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పొగాకు రైతుల సమస్యలను ప్రస్తావిస్తూ, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. ఐటీసీ కొనుగోళ్లు తగ్గించడంతో ప్రైవేట్ కంపెనీలు మద్దతు ధర ఇవ్వకుండా రైతులను అప్పులపాలు చేస్తున్నాయని తెలిపారు. రైతులు పండించిన పొగాకును బోర్డుకు తీసుకెళ్లి తిరిగి ఇంటికి తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకును మద్దతు ధరకు కొనుగోలు చేసేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల రవాణా ఖర్చులు అధికమై రైతు కుటుంబాలపై అదనపు భారం పడుతోందన్నారు. ట్రాక్టర్లు, రవాణా వాహనాల ఖర్చులు పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయని పేర్కొన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోడపాటి హనుమంతరావు, గంగినేని సత్యనారాయణ, గాలి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాస్యతలో పల్నాడుకు అగ్రస్థానం లక్ష్యం

## 1.39 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దే కార్యాచరణ

**పల్నాడు, రక్షణ న్యూస్**



పల్నాడు జిల్లాను అక్షరాస్యతలో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఘీఖీఱుఎబఅఱ పిలుపునిచ్చారు. జిల్లాలో నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ఈ ఏడాదిలోనే 1,39,168 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన 'అక్షర ఆంధ్ర-ఉల్లాస్' జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో నిరక్షరాస్యత జిల్లా అభివృద్ధికి ప్రధాన అవరోధంగా మారిందని పేర్కొన్నారు. ప్రతి శాఖ సమిష్టిగా కృషి చేస్తేనే లక్ష్యాలను సాధించగలమన్నారు. ప్రత్యేకించి స్వయం సహాయక సంఘాల్లోని నిరక్షరాస్య మహిళలను గుర్తించి వారికి చదువు నేర్పేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నిరక్షరాస్యుడిని అక్షరాస్యుడిగా తీర్చిదిద్దేందుకు మెప్మా, డ్వామా, డీఆర్‌డీఏ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. 'అక్షర ఆంధ్ర-ఉల్లాస్' కార్యక్రమం నిరక్షరాస్యులకు సువర్ణావకాశమని పేర్కొన్న డీఆర్వో, జూలై 7వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ఉల్లాస్ అక్షర ఆంధ్ర తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మెప్మా పీడీ మురళీకృష్ణ, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, డీపీవో నాగేశ్వర నాయక్, డీఆర్‌డీఏ ఏపీడీ రాంబాబు, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి గోపి, సీపీఓ రాజు తదితరులు పాల్గొన్నారు.